క్లుప్తంగా

రామాలయంలో ఎమ్మెల్యే పూజలు



రామాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: పట్టణంలోని చినబజారు రామాలయంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. శ్రీరామనవమి పురస్కరించుకుని, ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు వేదపండితులు స్వాగతం పలికి, స్వామి వారి ఆశీర్వచనాలుఅందజేశారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్‌నాయుడు తదితరులు ఉన్నారు.

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజాం సిటీ: బొద్దాం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఈ నెల 19వ తేదీన విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు డీఈఈ ఫణీంద్రకుమార్, ఏఈ వావిలపల్లి సురేష్‌కుమార్ ఓ ప్రకటనలో బుధవారం వెల్లడించారు. సబ్‌స్టేషన్ మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని, వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

రామభద్రపురం: మండలంలోని బూసాయవలసలో గిరిజనులపై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘం నాయకులు తుమ్మ అప్పలరాజు, పాలవలస భగవాన్, బిడ్డిక రామారావు, దుక్క సీతారాం డిమాండ్ చేశారు. ఇదే విషయమై వారు స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద బుధవారం ఆందోళన చేపట్టారు. భూ తగాదా నేపథ్యంలో గిరిజనులపై బీసీ వర్గానికి చెందిన కొంతమంది దాడికి పాల్పడ్డారని, ఈ దాడిలో దుక్క శ్రీనివాసరావు, దుక్క త్రినాథలకు గాయాలయ్యాయన్నారు. దాడులకు ఎగబడిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ఎస్‌ఐ జ్ఞానేశ్వరరావు.. ఇప్పటికే దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేశామని, డీఎస్పీ దర్యాప్తు అనంతరం నిందితులపై చర్యలు తీసుకుంటామన్నారు.

అర్హులను గుర్తించండి



మాట్లాడుతున్న తహసీల్దార్ చిరంజీవి పరాగ్

వంగర: రానున్న ఎన్నికల్లో ఇంటి వద్దనే ఓటు హక్కు వినియోగించుకునేందుకు అర్హత కలిగిన వారిని గుర్తించాలని తహసీల్దార్ చిరంజీవి పరాగ్ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సెక్టోరియల్ అధికారులు, బీఎల్‌వోలతో బుధవారం సమావేశమైన ఆయన మాట్లాడుతూ 85 ఏళ్ల వయసు దాటిన వృద్ధులు, పోలింగ్ కేంద్రాలకు రాలేని స్థితిలో ఉన్న దివ్యాంగుల పేర్లు జాబితా కార్యాలయానికి అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.సాల్మన్‌రాజ్, డీటీ బూరాడ సుందరరావు, ఆర్‌ఐ జామి మురళి తదితరులు పాల్గొన్నారు.

రాజుల మాయమాటలు నమ్మవద్దు



మాట్లాడుతున్న నియోజకవర్గ జేసీఎస్ ఇన్‌చార్జ్ శంబంగి వేణుగోపాలనాయుడు

రామభద్రపురం: ఎన్నికల వేళ బొబ్బిలి రాజులు చెబుతున్న మాయమాటలు నమ్మవద్దని నియోజకవర్గ జేసీఎస్ ఇన్‌చార్జ్ శంబంగి వేణుగోపాలనాయుడు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మీడియాతో బుధవారం మాట్లాడిన ఆయన.. మంత్రి పదవిలో ఉన్నప్పుడు నియోజకవర్గంలోని ఏ గ్రామంలోనూ కనీస అభివృద్ధి చేయని రాజులు ఈసారి ఎమ్మెల్యే పదవి ఇస్తే అభివృద్ధి చేస్తామని గ్రామాల్లో చెప్పుకుని, తిరుగుతున్నారని విమర్శించారు. పొరపాటున రాజులను గెలిపిస్తే ఏదైనా సమస్య పరిష్కారానికి వెళ్తే వారు పిలిచినంత వరకు వారి ఇంటి గేటు వద్ద చేతులు కట్టుకుని నిలబడాల్సిన దుస్థితి మళ్లీ వస్తుందన్నారు. రైతుబిడ్డ శంబంగి వెంకట చినఅప్పలనాయుడును గెలిపిస్తే ఆయన ఇంట్లోకి వెళ్లి మరీ సమస్యలు చెప్పుకోవచ్చన్నారు. గతంలోని టీడీపీ పాలనకు ఇప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను గమనించాలన్నారు. రానున్న ఎన్నికల్లోనూ ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి, వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, పార్టీ మండల అధ్యక్షుడు అప్పికొండ లక్ష్మంనాయుడు, మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చొక్కాపు తవిటినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరామనవమి వేడుకలు



రాజాం: సత్యసాయి సమితి శివం మందిరం వద్ద సీతారాముల కల్యాణం జరిపిస్తున్న భక్తులు



రాజాం సిటీ: పొనుగుటివలసలో సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు



బొబ్బిలి: జగన్నాథపురంలో ఉత్సవ విగ్రహాలతో సర్పంచ్ పద్మ దంపతులు

వాడవాడలా శ్రీరామనవమి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఆలయాలకు పోటెత్తిన భక్తులు దైవదర్శనం చేసుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఊరూరా వేసిన మండపాల్లో సీతారాముల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిపారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం ఉత్సవ విగ్రహాల తిరువీధి చేపట్టారు. లోక కల్యాణానికి ఏటా శ్రీరామనవమి నాడు రాములోరి కల్యాణం జరిపిస్తుండడం గమనార్హం.

–సాక్షి నెట్‌వర్క్.



రేగిడి: వన్నలిలో సీతారాముల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



సంతకవిటి: గుల్లసీతారాంపురంలో రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్ దంపతులకు రాముల వారి ఆశీర్వచనం అందిస్తున్న అర్చకులు



వంగర: కోనంగిపాడు రామాలయంలో సీతారాముల కల్యాణం దృశ్యం



రామభద్రపురం: ఎస్.చింతలవలస రామాలయంలో వైఎస్సార్ సీపీ నేతల పూజలు



తెర్లాం: నందబలగలో సీతారాముల కల్యాణానికి హాజరైన భక్తులు



బాడంగి: చినభీమవరంలో సీతారాముల కల్యాణోత్సవంలో మంగళసూత్రం భక్తులకు చూపిస్తున్న అర్చకులు

చంద్రబాబుకు మతిభ్రమించింది..

- వైఎస్సార్ సీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్



మాట్లాడుతున్న తలే రాజేష్

రాజాం: టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడుకు మతిభ్రమించిందని, రాజాంలో ఆయన పర్యటించినప్పుడు ఈ ప్రాంతానికి గతంలో ఆయన ఏం చేశారో, ఇప్పుడు ఏం చేస్తారో చెప్పలేక పోయారని వైఎస్సార్ సీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ విమర్శించారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలోని విలేకరులతో బుధవారం మాట్లాడుతూ.. ఇటీవల రాజాంలో నిర్వహించిన టీడీపీ ప్రజాగళంలో పాల్గొన్న చంద్రబాబు 2017, 2019లో ఆయన ముఖ్యమంత్రి హోదాలో రాజాం వచ్చినప్పుడు ఏ పనులు చేస్తామని చెప్పారో అవే పనులను ఈ ఎన్నికల ముందు హామీలుగా ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. విజనరీ అని చెప్పుకుంటున్న ఆయనకు రాజాంలో జరిగిన రోడ్ల విస్తరణ, ఆర్‌టీసీ కాంప్లెక్స్ నిర్మాణం, కిమ్మి–రుషింగి వంతెన ప్రారంభం, బలసలరేవు వంతెన నిర్మాణం వంటి పనులు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇచ్చిన హామీలే నెరవేర్చని బాబును రాజాం ప్రాంత ప్రజలు మళ్లీ ఆయనను ఎలా నమ్ముతారన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి రాజాం ప్రాంతానికి ఏ హామీ ఇవ్వకపోయినా రాజాం ప్రధాన రోడ్డు విస్తరణకు రూ.30 కోట్లు, రాజాం–పాలకొండ రోడ్డు విస్తరణకు రూ.13 కోట్లు ఇచ్చి, పనులు చేయించారన్నారు. వాల్తేరు బలసలరేవు వద్ద నాగావళి నదిపై వంతెన నిర్మిస్తామని 1998లో చంద్రబాబు హామీ ఇచ్చి, వదిలేస్తే తమ ప్రభుత్వం రూ.87 కోట్లు మంజూరు చేసి, వంతెన నిర్మాణం ప్రారంభించిందని, వీటిని మళ్లీ ఆయన హామీలుగా ఇవ్వడం సిగ్గుచేటన్నారు. వలంటీర్లపై అసభ్య పదజాలం, జులుం ప్రదర్శించి, ఈరోజు వలంటీర్ల రాజీనామాలకు ప్రధాన కారణమైన చంద్రబాబు పార్టీకి వలంటీర్లే సేవలు చేయాలని కోరడం ఆయనకు మతిభ్రమించిందనేందుకు నిదర్శనమన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న ఆయన రాష్ట్రానికి ఏం చేశారో చెప్పలేని దుస్థితిలో ఉన్నారని దుయ్యబట్టారు. సీఎం జగనన్న తన సుపరిపాలనతో ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని, ఆయనకు దక్కుతున్న ప్రజాదరణ చూసి చంద్రబాబునాయుడకు ఓటమి భయం పట్టుకుందన్నారు. స్థానికంగా ఉన్న ఓ మహిళా నేతకు రాజకీయ సమాధి కట్టి, లోకల్ బీసీ నేతలను రాజకీయంగా ఎదగకుండా అడ్డుకున్న చంద్రబాబు సామాజిక న్యాయం గురించి రాజాంలో మాట్లాడడం సిగ్గుచేటన్నారు. సీఎం జగన్‌పై ఆగంతుకులతో రాళ్లదాడి చేయించి, గులకరాయి అని చులకనగా మాట్లాడుతున్న చంద్రబాబుకు ప్రజలే మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు, పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, ఎంపీటీసీ కనకల సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల రాజీనామా

రాజాం: మండలంలోని వీఆర్ అగ్రహారం, నందబలగ, గురవాం తదితర గ్రామాలకు చెందిన గ్రామ వలంటీర్లు బుధవారం రాజీనామా చేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లి, తమ రాజీనామా పత్రాలు అందజేశారు. వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా చేసినట్లు వారు చెప్పారని ఎంపీడీవో వావిలపల్లి శ్రీనివాసరావు తెలిపారు.

రాజాం సిటీ: మండలంలోని బొమ్మినాయుడువలసకు చెందిన ఏడుగురు వలంటీర్లు బుధవారం రాజీనామా చేశారు. అనంతరం వారంతా మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లి, ఎంఈడీవో వావిలపల్లి శ్రీనివాసరావుకు రాజీనామా పత్రాలు అందజేశారు.

తెర్లాం: మండలంలోని కుసుమూరు, నందబలగ, కూనాయవలస, తెర్లాం, సుందరాడ, నెమలాం గ్రామాలకు చెందిన మొత్తం 69 మంది గ్రామ వలంటీర్లు రాజీనామా చేసినట్లు ఎంపీడీవో బి.మధుసూదనరావు తెలిపారు.

బాడంగి: మండలంలోని వాడాడ, బాడంగి, పిన్నవలస, బొత్సవానివలస, పాల్తేరు, వీరసాగరం, ఆనవరం, గూడెపువలస, భీమవరం, కోటిపల్లి గ్రామ వలంటీర్లు బుధవారం రాజీనామా చేశారు. అనంతరం వారి రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. తామంత స్వచ్ఛందంగానే రాజీనామా చేశామని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని వారు తెలిపారు.



బాడంగి: వాడాడ సచివాలయంలో రాజీనామా పత్రాలతో వలంటీర్లు



రాజాం: రాజీనామా పత్రాలు అందజేస్తున్న వీఆర్‌అగ్రహారం వలంటీర్లు



రాజాం సిటీ: ఎంపీడీవోకు రాజీనామా పత్రాలు అందజేస్తున్న వలంటీర్లు



తెర్లాం: నెమలాంలో రాజీనామా పత్రాలు అందజేస్తున్న వలంటీర్లు

నాడు నిర్లక్ష్యం.. నేడు అభివృద్ధి పథం!

సీఎం జగనన్న పారదర్శక పాలనకు సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది.. రాజాం మండలంలోని శ్యాంపురం గ్రామం. టీడీపీ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన ఈ గ్రామంలో ఇప్పుడు అభివృద్ధి కొత్తపుంతలు తొక్కుతోంది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గతంలో ఎన్నడూ లేనంతగా అభివృద్ధి, సంక్షేమం జరగడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకతీతంగా రూ.15.85 కోట్ల నిధులతో సంక్షేమాభివృద్ధి జరగడంతో ఇది కదా ప్రజాప్రభుత్వం, ఇది కదా సంక్షేమ పాలన అని ప్రజలంతా భావిస్తుండడం విశేషం. – రాజాం



నాడు–నేడు కార్యక్రమం ద్వారా అభివృద్ధి చేసిన పాఠశాల

అభివృద్ధి, సంక్షేమం వివరాలిలా..

గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు నాడు–నేడు పథకం ద్వారా రూ.15,27,745 నిధులు వెచ్చించారు. పాఠశాల భవనాలు బాగుచేయడంతో పాటు తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించారు. గ్రామ సచివాలయ భవనానికి రూ.43 లక్షలు, రైతు భరోసా కేంద్రం భవనానికి రూ.23 లక్షలు, వైఎస్సార్ వెల్‌నెస్ సెంటర్ భవన నిర్మాణానికి రూ. 20 లక్షల నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుతం ఈ నిధులతో భవన నిర్మాణాలు కూడా పూర్తయి, ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. అలాగే గ్రామంలో అత్యధికంగా 58 మందికి రూ.1,42,68,000 లతో జగనన్న ఇంటి పథకం వర్తించింది. ఇల్లు లేని పేదలకు ఇంటి పట్టాలతో పాటు ఇంటి నిర్మాణ బిల్లులు మంజూరయ్యాయి. 491 మందికి వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా రూ.1.03 కోట్ల వడ్డీ నగదు సాయం లభించింది. ప్రతినెలా 398 మంది వైఎస్సార్ పింఛన్ కానుక లబ్ధి పొందుతున్నారు. నవరత్నాలు(సంక్షేమ పథకాలు) ద్వారా మొత్తం రూ.11,79,69,785 లబ్ధి డీబీటీ ద్వారా, నాన్ డీబీటీ ద్వారా రూ.3,26,21,759 లబ్ధి గ్రామస్తులకు చేకూరింది. మరో రూ.4.69 లక్షల గ్రామ పంచాయతీ నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టారు.



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న గ్రామసచివాలయ భవనం



గ్రామంలో కొత్తగా నిర్మించిన సీసీ రోడ్డు



రూ.23 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం



పూర్తవుతున్న వైఎస్సార్ వెల్‌నెస్ సెంటర్ భవన నిర్మాణం

వైఎస్సార్ సీపీని మళ్లీ గెలిపించండి

ఎన్నికల వేళ వైఎస్సార్ సీపీ నేతలు ప్రచారంలో నిమగ్నమయ్యారు. ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వం చేసిన మంచిని వివరిస్తున్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, మళ్లీ వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకురావాలని కోరుతున్నారు. గ్రామగ్రామాన ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పార్టీ నేతలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుండడం విశేషం. -సాక్షి నెట్‌వర్క్



తెర్లాం: కుసుమూరులో ఎన్నికల ప్రచారంలో బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరావు



బాడంగి: పిన్నవలసలో ప్రచారం చేస్తున్న జిల్లా జేసీఎస్ కన్వీనర్ శంబంగి శ్రీకాంత్



వంగర: మద్దివలసలో ఎన్నికల ప్రచారంలో ఎంపీపీ సురేష్‌ముఖర్జీ, సర్పంచ్ గణేష్‌బెనర్జీ



తెర్లాం: చీకటిపేటలో వైఎస్సార్ సీపీ నేతల ఎన్నికల ప్రచారం



రేగిడి: చిన్నకోడిశలో ఎన్నికల ప్రచారంలో వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు తదితరులు



రాజాం: సోపేరులో జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరుతున్న జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసరావు

నేటి నుంచి నామినేషన్ల ప్రక్రియ

బొబ్బిలి: రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి, ఈ నెల 18వ తేదీ నుంచి అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని ఆర్‌డీవో, బొబ్బిలి రిటర్నింగ్ ఆఫీసర్ ఎ.సా యిశ్రీ ఓ ప్రకటనలో బుధవారం తెలిపారు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థితో పాటు నలుగురు వ్యక్తులకు మాత్రమే నామినేషన్ వేసే కార్యాలయంలోకి అనుమతి ఇస్తామని, మిగతా వారంతా కార్యాలయం నుంచి 100 మీటర్ల దూరంలో ఉండాల్సి ఉంటుందన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందన్నారు. నామినేషన్ వేసిన దగ్గర నుంచి అభ్యర్థి ఖర్చు లెక్కిస్తామన్నారు. సువిధ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో నామినేషన్లను స్వీకరించే అవకాశం ఉన్నప్పటికీ కాపీలను ఆర్‌వోకు స్వయంగా అందజేయాల్సి ఉంటుందన్నారు. నామినేషన్ల దాఖలుకు ఈ నెల 25వ తేదీ ఆఖరు అని, పోలింగ్ మే 13న పోలింగ్, జూన్ 4న ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు.

జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి



రాజాం: చిన్నచెరువుగట్టు ప్రాంతంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్

రాజాం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లోనూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, మళ్లీ జగనన్న ప్రభుత్వాన్ని అధికారంలోకి వచ్చేలా ఆశీర్వదించాలని వైఎస్సార్ సీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ కోరారు. స్థానిక పట్టణంలోని పాత తహసీల్దార్ కార్యాలయం వీధి, పొట్టా వీధి, చిన్నచెరువుగట్టు ప్రాంతాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఆయనకు ఆయా ప్రాంతాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన ఈ ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమం వివరించారు. అలాగే గతంలో టీడీపీ మోసపూరిత హామీలతో ప్రజలను మోసగించిన తీరును ఎండగట్టారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని, అన్నివర్గాల ప్రజలకు అన్ని విధాలా ఆయన న్యాయం చేస్తున్నారన్నారు. మళ్లీ జగనన్న ముఖ్యమంత్రి అయితే రాష్ట్రం మరింత బాగుంటుందన్నారు. మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి, ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనను, ఎంపీగా బరిలో ఉన్న బెల్లాన చంద్రశేఖర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, వైఎస్సార్ సీపీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, జేసీఎస్ కన్వీనర్ పాలవలస గోపి, పట్టుశాలి కార్పొరేషన్ డైరెక్టర్ బొల్లా లలితకుమారి తదితరులు పాల్గొన్నారు.